## క్లుప్తంగా

### నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



లక్కిరెడ్డిపల్లి బియ్యం గోదామును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ రంగస్వామి

**లక్కిరెడ్డిపల్లి:** చౌక దుకాణాదారులు నిత్యావసర సరుకుల పంపిణీలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆర్డీఓ రంగస్వామి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పౌరసరఫరాల గోదామును రాయచోటి ఆర్డీఓ రంగస్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక చౌకదుకాణాల డీలర్లకు వందశాతం బియ్యం తూకాలు వేసి పంపిణీ చేయాలని గోదాము ఇన్‌చార్జి మల్లికార్జున బాబుకు సూచించారు. బియ్యం బస్తాలను తూకాలు వేసి బస్తాలు నిర్దిష్ట ప్రమాణంలో ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. సకాలంలో నిత్యావసర సరుకును చౌక దుకాణాలకు అందించాలని, ఒకటో తేదీచి నిత్యావసర సరుకులు పంపిణీ చేసేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఉస్మాన్ సాబ్, డీటీ రెడ్డన్న, ఆర్ఐ సమ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

### ఉన్నత చదువుకు ఉపకారం



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**ఓబులవారిపల్లె:** ఆర్థిక స్థోమత లేకపోవడంతో గ్రామాలు, పట్టణాల్లో ప్రతిభ కలిగిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. అలాంటి వారికి అండగా నిలిచేందుకు ఉపకార వేతనాలు అందిస్తున్నారు. ఓబులవారిపల్లిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏ. భాను ప్రకాష్, ఎస్. తేజశ్రీ, గీతిక 2023–24 సంవత్సరానికి జాతీయస్థాయి ఉపకార వేతన ఎంపిక పరీక్ష ఎన్ఎంఎంఎస్‌లో ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. వీరికి ప్రతి ఏడాది రూ. 12 వేలు చొప్పున వరుసగా నాలుగు సంవత్సరాలు ఉపకార వేతనం అందజేస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణయ్య తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

### ఎస్సీ వర్గీకరణపై చట్టం చేయాలి

**రాయచోటి అర్బన్:** ఎస్సీ వర్గీకరణపై చట్టం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నేత రామాంజులు, ఎంఈఎఫ్ జిల్లా నేత హరిబాబు కోరారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నేతలు శనివారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని తెలిపారు. సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధంగా ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలకు పరిమితం చేస్తూ ఇచ్చిన తీర్పును అందరూ గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నేతలు, వెంకటరమణ, రెడ్డెయ్య, రాచరాయుడు, జి.వి.రమణ, వెంకటసుబ్బయ్య, సీపీఎం నేత రామాంజనేయులు, ఎమ్మార్పీఎస్ నాయకులు మనోహర్, ఆనంద్ పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య సామగ్రి పంపిణీ

**రాజంపేట:** పురపాలక సంఘం కార్మికులకు పారిశుద్ధ్య సామగ్రిని శనివారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, కమిషనర్ రాంబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపి, వైఎస్‌చైర్మన్ సుమియా, కౌన్సిలర్లు రాముయాదవ్, డొంకా సురేష్, నవీన్, రమేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యతో ఉజ్వల భవిష్యత్తు



గంగనపల్లిని సన్మానిస్తున్న అధ్యాపకులు

**రాజంపేట రూరల్:** విద్యతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ తెలిపారు. స్థానిక రాజు హైస్కూల్‌లో సీఈఓ గుంటిమడుగు రఘురామరాజు ఆధ్వర్యంలో యాంబినేషన్ డే వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యాన్ని ఎంచుకొని దానికి అనుగుణంగా చదవాలని సూచించారు. అనంతరం గంగనపల్లి వెంకటరమణను అధ్యాపక బృందం సన్మానించింది. ప్రిన్సిపాల్ పి. మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు తేజ, సుబ్బారెడ్డి, హబీబ్, సునీత, నాగమణి, గాయత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు కంటి పరీక్షలు

**పుల్లంపేట:** పుల్లంపేటలోని బీపీ శేషయ్య సంస్మృత ఉన్నత పాఠశాలలో శనివారం ఆప్తాలమిక్ అధికారి పోలిచర్ల ఓబులేసు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప జిల్లా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సానే శేఖర్ పాల్గొన్నారు. కంటి పరీక్షలు సకాలంలో చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ మనోజ్ కుమార్, హెడ్ మాస్టర్ సి. మురళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వేప ఉత్పత్తులు.. కీటక నాశకాలు

వేపచెట్టు నీడ నిచ్చే చెట్టు కాకుండా.. వేపు ఉత్పత్తులు అద్భుత కీటకనాశనులుగా పని చేస్తున్నాయి. వేప చెట్టు ఎన్నో లాభదాయకమైన రసాయనాల సమ్మేళనము. పంటలకు సోకే తెగుళ్లు, పురుగుల నివారణకు పురుగు మందులకు బదులు వేప పిండి, వేప నూనెను రైతులు వినియోగించుకోవడం పరిపాటిగా మారింది. బెరడు మొదలుకొని వేపాకుల దాకా, ఆఖరికి పూలు, పండ్లు , విత్తనాలు.. ఇలా వేప చెట్టులోని అన్ని భాగాలు అన్నదాతకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.



- వేప ఉత్పత్తుల వినియోగంపై అన్నదాతల దృష్టి
- తక్కువ ఖర్చు.. అధిక దిగుబడులు
- 300 రకాల కీటకాలు నాశనం

**గాలివీడు :** వేపలో అజాడిరాక్టిన్ అనుకూల పదార్థం ఉంటుంది. దీనికి 300 రకాల కీటకాలు, నల్లాతి పరుగులు, చెదలు, భూమిలోని కొన్ని రకాల బూజు శిలీంధ్రాలను అరికట్టే శక్తి ఉంటుంది. వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటలను ఆశించే కీటకాలను వేప అరికడుతుంది. మార్కెట్‌లో వేప పిండి, వేప నూనె, వేప కషాయం ఇలా వివిధ రకాల వేప ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి.

**కీటకాల నివారణలో కీలకం**

నీమ్ ఆయిల్ స్థానిక వ్యవసాయ నిపుణుల సూచన మేరకు వినియోగిస్తే కీటకాలను నివారించవచ్చు. ఈ మందు పిచికారీ చేసినప్పుడు పురుగులకు వికారం కలిగించి పైరును నాశనం చేయకుండా చేస్తుంది. విషపూరిత అవశేషాలు ఉండవు. ఇది పక్షులు, మానవులు, మిత్రపురుగులు, తేనెటీగలు వంటి జీవరాశులకు హాని చేయదు. సమగ్ర సస్యరక్షణ విధానంలో వేప మందులు బాగా ఉపయుక్తమవుతాయి. పురుగు మందులు, శిలీంధ్ర నాశినులతో వేపను కలిపి సురక్షితంగా పిచికారీ చేసుకోవచ్చు.

**పిచికారీకి సానుకూల సమయం**

పైరుపై పురుగు ఆశించిన వెంటనే వేప నూనె పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచిది. 3 నుంచి 5 మిల్లీ లీటర్లు నీమ్ ఆయిల్‌ను లీటరు నీటితో కలిపి ఎకరాకు 20 లీటర్లు పిచికారీ చేయాలి. వాతావరణం చల్లగా ఉన్న సమయాల్లో (ఉదయం లేక సాయంత్రం) 7 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. పిచికారీ చేసిన తరువాత 6 గంటల వ్యవధిలో వర్షం పడితే మళ్లీ పిచికారీ చేయాల్సిందే.

**తెగుళ్ల నివారణ**

వివిధ పంటల్లో వేప మందులు వాడకంతో పలు రకాల చీడపీడలను నివారించవచ్చు. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేపపిండిని దమ్ములో వేయడం ద్వార కాండం తొలిచేపురుగు, ఉల్లికోడుసు అదుపు చేయవచ్చు. వరిపైరుపై లీటర్లు నీటికి 3 మిల్లీ లీటర్లు చొప్పున కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేస్తే అగ్గితెగుళ్లు, తొడిమికుళ్లు, పొడతెగులు, వరి తుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేసుకోవచ్చు. 5 శాతం వేప గింజల కషాయం ఎకరాకు 200 లీటర్లు ద్రావణాన్ని మిరప పంటపై పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. తద్వారా మిరప మీద వచ్చే జెమినీ వైరస్ అదుపులో ఉంటుంది. వేరుశనగను ఆశించి ఎక్కువగా నష్టపరిచే తిక్కాకు మచ్చ తెగుళ్లు, టమాటా సాగులో ఎండు తెగుళ్లను వేప నూనెతో నివారించవచ్చు.

**ఇంట్లోనే వేప కషాయం తయారీ**

పంటకు అవసరమైన వేప కషాయాన్ని ఇంట్లోని మహిళలే తయారు చేసుకోవచ్చు. 5 కిలోల వేప గింజలు నలగగొట్టి 6 నుంచి 7 లీటర్లు నీటిలో రెండు, మూడు రోజులు నానబెట్టాలి. దీన్ని వస్త్రంలో వడకట్టాలి. మరో 100 లీటర్లు నీటిని అందులో కలిపి వినియోగించాలి.

**వేపతో మంచి ఫలితాలు**



వేప గింజల నుండి నూనె తీస్తారు. నూనె తీయగా వచ్చే వేపరెక్క ఎండిన వేపకాయలను దంచగా వేపపిండి ఎక్కువగా వరి పంట, నిమ్మ తోటలకు వాడవచ్చు. ఎటువంటి పంటలైనా వేప ఉత్పత్తులను వాడి రైతులు దిగుబడితో మంచి ఫలితాలు పొందవచ్చు.

–ఎమ్.మురళీధర్, మండల వ్యవసాయ అధికారి, గాలివీడు మండలం

# ప్లాస్టిక్ నివారణ అందరి బాధ్యత

**రాజంపేట టౌన్:** ప్లాస్టిక్‌ను నివారించడం అందరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తం పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్లాస్టిక్ నివారణపై ప్రిన్సిపాల్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ప్లాస్టిక్‌ను నివారించకుంటే కాలుష్య సమస్యలు తలెత్తి వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతాయని హెచ్చరించారు. కాగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు శివాజి, మణి, రాఘవ, నవీన్, మురారి, హరికృష్ణారెడ్డి, సుబ్బారావు, నికేతన్ తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలను సంచుల్లో వేస్తున్న విద్యార్థులు

### ఉచిత వైద్య శిబిరం

**వీరబల్లి:** మండల కేంద్రంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఖాతాదారులకు ఇన్సూరెన్స్ కల్పించాలనే ఉద్దేశ్యంతో నివాభూప ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు బ్యాంకు మేనేజర్ నాగవర్ధన్ తెలిపారు. బ్యాంకు ఖాతాదారులందరికీ ఉచిత వైద్యం చేసి వారికి కావాల్సిన మాత్రలు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగులకు 45 శాతం ఐఆర్ ప్రకటించాలి

**రాజంపేట టౌన్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే 45 శాతం ఐఆర్ ప్రకటించాలని ఎస్‌టీయూ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ పిల్లి రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంను కొనసాగించాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్‌పై స్పందించాలని కోరారు. స్కూల్ గ్రాంట్ మంజూరు చేయాలని, 117 జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# ముర్రుపాలతో రోగనిరోధక శక్తి



రాయచోటి అర్బన్ : తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



పెనగలూరు: అంగన్‌వాడీ కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న సీడీపీఓ రాజేశ్వరి

**రాయచోటి అర్బన్ :** బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం ద్వారా రోగనిరోధక శక్తి పెంపొందుతుందని రాయచోటి సెక్టార్ –2 సూపర్‌వైజర్‌లు సుగుణమ్మ, నాగమణి తెలిపారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం మున్సిపల్ పరిధిలోని రాయుడు కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల వరకు బిడ్డకు తల్లిపాలు తాగించాలని సూచించారు. ఆవులు, గేదెలు, డబ్బా పాలు తాగిస్తే పిల్లలకు అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని చెప్పారు. 6 నెలల తరువాత పిల్లలకు అనుబంధ ఆహారంతో పాటు తల్లిపాలను కూడా తాగించాలని పేర్కొన్నారు.

**బిడ్డలకు తల్లిపాలు శ్రేష్టం**

**పుల్లంపేట:** బిడ్డలకు ముర్రుపాలు ఎంతో శ్రేష్టమైనవని పుల్లంపేట అంగన్ వాడీ సూపర్‌వైజర్ జయలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎగువరెడ్డిపల్లి, బలిజపల్లి గ్రామాలలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని, తల్లులు తప్పనిసరిగా పిల్లలకు తల్లిపాలు తాపించాలని సూచించారు. అంగన్ వాడీ సిబ్బంది అనుసూయ, లక్ష్మీదేవి, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

**తల్లిపాలు అమృతం లాంటివి**

**పెనగలూరు:** తల్లిపాలు అమృతం లాంటివని కోడూరు సెక్టార్ సీడీపీఓ రాజేశ్వరి అన్నారు. శనివారం బుట్టిరెడ్డిగారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు పట్టించాలన్నారు. ముర్రుపాలు వలన బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు. తల్లిపాలు వలన బిడ్డకు కలిగే ప్రయోజనాలు గురించి గర్భిణులు, బాలింతలకు వివరించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్లు విశాలాక్షి, విజయకుమారి, వసుందరమ్మ, సురేఖా రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**రామాపురం:** బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గువ్వలచెరువు క్లస్టర్ పరిధిలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయితీ సుగాలిబిడికిలో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు తులసమ్మ, పద్మజరాణి, హుశేనమ్మ, సుజాతరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

# ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి ఆదర్శప్రాయుడు



ఈశ్వరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

**రాయచోటి అర్బన్ :** మాజీ ఎంపీ ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి ఆదర్శప్రాయుడని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు మండెం సుధీర్‌కుమార్ కొనియాడారు. శనివారం పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఎద్దుల ఈశ్వరరెడ్డి 39వ వర్ధంతి సందర్భంగా ఆయన ఈశ్వరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎద్దుల ఈశ్వరరెడ్డిని ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈశ్వర్‌రెడ్డి భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ నిరంతరం పేదల అభ్యున్నతి కోసం పనిచేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్, ఏఐటీయూసీ నేత బి.వెంకటేశు, పుల్లయ్య, డీహెచ్‌పీయస్ నేత శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# నేడు చౌడేశ్వరీదేవి తిరునాల



చౌడేశ్వరిదేవి మూలవిరాట్

**సిద్ధవటం:** మండల కేంద్రమైన సిద్ధవటం దిగువపేట గాండ్లపాళెంలో వెలసిన చౌడేశ్వరీదేవి అమ్మవారి తిరునాల ఆదివారం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అమ్మవారి తిరునాల సందర్భంగా కమలాపురం మండలం పెద్దపుత్త గ్రామానికి చెందిన 36 మంది వేద పండితులతో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, దేవీ ఖడ్గమాల, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి 7 గంటల నుంచి చౌడేశ్వరిదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

**రాయచోటి టౌన్ :** రాయచోటి కొత్తపేటలోని చౌడేశ్వరీ దేవి అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించనున్నట్లు తొగట వీరక్షత్రి సంఘం నాయకులు, ఆలయ కార్య నిర్వహాలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# రాజంపేటలో గ్యాస్ క్రిమిటోరియం!

- రూ.కోటి నిధులతో నిర్మాణం
- రూ.75 లక్షలు మంజూరు చేసిన సీడీఎంఏ

**రాజంపేట:** పట్టణంలోని రామ్‌నగర్‌లో ఉన్న ఎలక్ట్రికల్ క్రిమిటోరియం స్థానంలో గ్యాస్ క్రిమిటోరియంను పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్నారు. నిర్మాణం కొరకు రూ.కోటి నిధులు కేటాయించారు. శనివారం జరిగిన పురపాలకసంఘం కౌన్సిల్‌లో తీర్మానించారు. చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి స్థానిక శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి హాజరైయ్యారు. వారు మాట్లాడుతూ రాజంపేట పట్టణాభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ రాంబాబు నేతృత్వంలో అజెండాను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు.

**సీడీఎంఏకు ప్రతిపాదనలు**

పట్టణంలో గ్యాస్ క్రిమిటోరియం నిర్మాణానికి రూ.కోటి ప్రతిపాదనలు చేయగా.. సీడీఎంఏ (గుంటూరు) ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ పెసిలేటిస్‌లో రూ.75 లక్షలు మంజూరు చేసింది. మిగిలిన రూ.25 లక్షలు అందుబాటులో ఉన్న నిధులను వినియోగించాలని కౌన్సిల్ ఆమోదం తెలిపింది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి

- పట్టణంలో గోవులు తాకిడి అధికమైందని, ఫలితంగా ట్రాఫిక్‌తో పాటు పాదచారులు, వాహనాదరులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, గోశాల నిర్మించాలని కౌన్సిలర్ సురేష్ సమావేశం దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి గోశాల నిర్మాణం కోసం ఎకరా స్థలం ఇస్తామని హామీ ఇవ్వడంతో ధన్యవాదాలను తెలిపారు.
- పట్టణంలోని బలజిపల్లె ప్రాంతంలోని స్మశానవాటిక కబ్జాకు గురవుతోందని, హద్దులు గుర్తించి, పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ ప్రతాప్ కోరారు. కౌన్సిల్ సానుకూలంగా స్పందించింది.

### ఘనంగా గంగమ్మతల్లి జాతర

**రైల్వేకోడూరు అర్బన్:** రైల్వేకోడూరు మండలంలోని యానాదిపల్లి అరుంధతివాడలో శనివారం ఘనంగా గంగమ్మతల్లి జాతర నిర్వహించారు. పలువురు భక్తులు భక్తి శ్రద్ధలతో మొక్కుబడులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మండల నాగేంద్ర, బీవీ రమణ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

### ఘనంగా రుద్రాభిషేకం

**రాజంపేట టౌన్:** మాసశివరాత్రిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని శంకరాచార్యుల మఠంలో పరమేశ్వరుడు, ఆదిశంకరాచార్యులు, సరస్వతీదేవికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు శివకుమార్, సరసా సాయికుమార్ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అద్వేత సమితి పాలకమండలి ప్రతినిధులు వల్లభరావు, రాధాకృష్ణ, రవికుమార్, నాగరాజు పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

**రాజంపేట రూరల్:** పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని పంచాయతీ సెక్రటరీ చెమ్మా శ్రీనివాసులు తెలిపారు. పారిశుద్ధ్య పక్షోత్సవాలలో భాగంగా హస్తవరం పంచాయతీ పరిధిలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గొల్లపల్లి గ్రామంలో రహదారికి ఇరువైపుల చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లారు. అదే విధంగా ముళ్లపొదలను డోజర్ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. సర్పంచ్ హస్తవరం మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ నరసింహరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### అన్నదానం

**రైల్వేకోడూరు అర్బన్:** రైల్వేకోడూరు పట్టణంలోని టోల్‌గేట్, గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు సీహెచ్ రమేష్ శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది తల్లిదండ్రులను గుర్తించుకొని వారి జ్ఞాపకార్థం అన్నదానం, సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వరీ తదితర నాయకులు పాల్గొన్నారు.

రాజంపేట రూరల్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పాతబస్టాండు వైఎస్సార్ సర్కిల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్దిరెడ్డి రవికుమార్ రెడ్డి, కుమారుడు పెద్దిరెడ్డి ప్రియదర్శన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ ఎస్ నరసింహరాజు, మాజీ ప్రెసిండెంట్ వెంకటసుబ్బయ్య, ప్రతినిధులు పాల్గొన్నారు.

### అందుబాటులో గడ్డి విత్తనాలు

**సుండుపల్లె:** రాష్ట్ర ప్రభుత్వం 75శాతం సబ్సిడీతో గడ్డివిత్తనాలు సరఫరా చేస్తుందని, వాటిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ ఏడీ విజయకుమార్ తెలిపారు. సుండుపల్లి మండలానికి 800 కేజీలు, వీరబల్లి మండలానికి 800 కేజీలు మంజూరయ్యాయని తెలిపారు. ఐదు కేజీలు బ్యాగు రూ. 115 ధర ఉంటుందని పేర్కొన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు తీసుకొని పశువైద్య కార్యాలయం వద్దకు రావాలని ఆయన తెలియజేశారు.

### రైతులను ఆదుకుంటాం

**రామాపురం:** జన చైతన్య రైతు ఉత్పత్తుల సహకార సంఘంలోని రైతులను ఆదుకుంటామని ఆ సంఘం అధ్యక్షుడు గోపాల్ తెలిపారు. శనివారం నీలకంట్రావుపేటలోని జన చైతన్య రైతు ఉత్పత్తుల సహకార సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గోపాల్ మాట్లాడుతూ సంఘంలో 215 మంది సభ్యులు ఉన్నారని, షేర్ క్యాపిటల్ ఒక లక్ష ఏడువేల రూపాయలు ఉందని తెలిపారు. మండలంలో 12 గ్రామాలలో సంఘం విస్తరించిందని పేర్కొన్నారు. సమావేశంలో మండలంలోని రైతులు పాల్గొన్నారు.

### న్యాయం చేయండి

**ఓబులవారిపల్లె (రైల్వేకోడూరు అర్బన్):** ఓబులవారిపల్లె మండలంలో ఆకేపాటి నాగార్జున రెడ్డి అనే వ్యక్తి భూమిని విక్రయించి అడ్డు తిరిగాడని బాధితులు నిరసన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ మాయాజాలంతో ల్యాండ్ కన్వర్స్ లేకుండా రిజిస్ట్రేషన్లు చేయడం వల్లే సమస్యలు వచ్చాయని బాధితులు శనివారం పేర్కొన్నారు. నాగార్జున రెడ్డి నాలుగు ఎకరాలు తన పేరు ఉన్న భూమిని విక్రయించి ఇప్పుడు మాట మార్చుతున్నారని తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు.